కేంద్ర బడ్జెట్‌లో తెలంగాణ పేరు లేకపోవడం దారుణం: గౌరీసతీశ్

అబిడ్స్, జూలై 23 : కేంద్ర ప్రభుత్వం పార్లమెంట్‌లో ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో తెలంగాణ ప్రజల ఆకాంక్షలను కాలరాసినట్లు ఉందని తెలంగాణ కాంగ్రెస్ అధికార ప్రతినిధి గౌరీ సతీశ్ విమర్శించారు. బడ్జెట్‌లో తెలంగాణకు ఎలాంటి లబ్ధి చేకూర్చని ఎన్‌డీఏ ప్రభుత్వం తెలంగాణ ప్రజలను అవమానపరిచిందని అన్నారు. మంగళవారం పార్లమెంట్‌లో కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలాసీతారామన్ ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో తెలంగాణకు ఎలాంటి ప్రయోజనం చేకూర్చలేదని మండిపడ్డారు. కనీసం తెలంగాణ పేరును ప్రస్తావించకపోవడంపై ఆయన కేంద్ర ప్రభుత్వ తీరును తప్పుపట్టారు.

షేక్‌పేట్ సబ్‌డివిజన్ -1 డీజీఎంగా లక్ష్మీనర్సింహ

మెహిదీపట్నం, జూలై 23 : ప్రజలకు నీటి కష్టాలు లేకుండా కృషి చేస్తానని జలమండలి డివిజన్ -3 షేక్‌పేట్ సబ్‌డివిజన్ 1 డీజీఎం లక్ష్మీనర్సింహ అన్నారు. ఇక్కడ డీజీఎంగా పనిచేస్తున్న జవహర్‌అలీ బదిలీ కావడంతో మంగళవారం లక్ష్మీనర్సింహ డీజీఎంగా పదవీ బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన తన కార్యాలయంలో మాట్లాడుతూ.. ప్రజలకు నీటి సమస్యలు లేకుండా కృషి చేస్తానని చెప్పారు. సమయపాలన పాటిస్తూ నీటి సరఫరా సక్రమంగా జరిగే విధంగా సిబ్బందిని సమన్వయ పరుస్తానని పేర్కొన్నారు.

గోల్కొండ ఏసీపీకి సన్మానం

గోల్కొండ పోలీస్ సబ్‌డివిజన్ ఏసీపీ సయ్యద్ ఫయాజ్‌ను మంగళవారం లంగర్‌హౌస్, గోల్కొండ ప్రాంతాల మైత్రి, పీస్ కమిటీల వారు ఘనంగా సన్మానించారు. గోల్కొండ జగదాంబిక మహంకాళి ఎల్లమ్మ ఆలయం ఆషాఢ మాసం బోనాలలో ఐదు బోనాలను విజయవంతంగా పూర్తి అవడంతో సభ్యులు ఆయనను సన్మానించారు. – మెహిదీపట్నం, జూలై 23

నూతన డీజీఎంకు..

జలమండలి డివిజన్ -3 షేక్‌పేట్ సబ్‌డివిజన్-1 డీజీఎంగా పదవీబాధ్యతలు చేపట్టిన లక్ష్మీనర్సింహను మేనేజర్ సాజిద్ అలీ, టెక్నికల్ ఆఫీసర్ బి.నర్సింగ్‌రావు మంగళవారం సన్మానించారు. – మెహిదీపట్నం

నియోజకవర్గ అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి

ఎమ్మెల్యే ముఠా గోపాల్‌కు సమస్యలను వివరిస్తున్న భీమానగర్ కాలనీ నూతన సంఘం నాయకులు

చిక్కడపల్లి,జూలై 23 : ముషీరాబాద్‌లోని బస్తీ కాలనీల్లో ఉన్న ప్రజా సమస్యలు పరిష్కరించడం, అభివృద్ధి పై ప్రత్యేక దృష్టి పెట్టడం జరిగిందని ఎమ్మెల్యే ముఠా గోపాల్ అన్నారు. కవాడిగూడ డివిజన్ భీమానగర్(ఎల్ఐసీకాలనీ) కాలనీ నూతన సంఘం నాయకులు ఎమ్మెల్యే ముఠా గోపాల్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ఎలాంటి సమస్యలు ఉన్నా తన దృష్టికి తీసుకురావాలని సూచించారు. ఈ సందర్భంగా కమిటీ సభ్యులకు ఎమ్మెల్యే అభినందనలు తెలిపారు. ఈ అధ్యక్షుడు వైఎల్.ఎన్. కుమార్, ఉపాధ్యక్షుడు కె.సత్యనారాయణ, ప్రధాన కార్యదర్శి రాజేశ్ మాట్లాడుతూ.. ఏడు సంవత్సరాలుగా కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ పూర్తి స్థాయి కమిటీ లేకపోవడంతో కాలనీలో సమస్యలు పేరుకుపోయానని ఎమ్మెల్యేకు వివరించడం జరిగిందన్నారు. ఎమ్మెల్యే సానుకూలంగా స్పందించారని తెలిపారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ విద్యార్థి విభాగం రాష్ట్ర నాయకుడు విశాల్, జాయింట్ సెక్రటరీ రేబాక జకారియా, కోశాధికారి కె.రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా బోనాలు..ఘటాల ఊరేగింపు

సుల్తాన్‌బజార్, జూలై 23 : నిజాం కళాశాలలో మంగళవారం నిర్వహించిన బోనాల వేడుకలను కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ భీమా ఆధ్వర్యంలో కన్నుల పండువగా నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళా ఉద్యోగులు సాంప్రదాయ దుస్తులు ధరించి బోనాలను ఎత్తుకొని ప్రిన్సిపాల్ చాంబర్ నుంచి అమ్మవారి ఆలయం వద్దకు తరలి వెళ్లి బోనాలను సమర్పించారు. అనంతరం ఓయూ వీసీ ఓఎస్‌డీ ప్రొఫెసర్ రెడ్యా నాయక్, గన్‌ఫౌండ్రీ కార్పొరేటర్ డాక్టర్ సురేఖ, కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ భీమా, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ జి. ఉపేందర్‌రెడ్డి అమ్మ వారికి ప్రత్యేక పూజలను నిర్వహించారు.

బోనాలను ఎత్తుకొని అమ్మవారి ఆలయానికి తరలివెళ్తున్న నిజాం కాళాశాల మహిళా ఉద్యోగులు

బర్కత్‌పుర ఈపీఎఫ్ కార్యాలయంలో..



అమ్మవారిని దర్శించుకుంటున్న సెంట్రల్ బోర్డు ట్రస్టీ మల్లేశం, రాంబాబు, ప్రసాద్, టీకారాం, సిబ్బంది

కాచిగూడ : తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు బోనాల పండుగ ప్రతీకగా నిలుస్తాయని పీఎఫ్ సెంట్రల్ బోర్డు ఆఫ్ ట్రస్టీ సుంకరి మల్లేశం అన్నారు. ఈపీఎఫ్ దర్బార్ మైసమ్మ దేవాలయ చైర్మన్ పెండ్యాల రాంబాబు ఆధ్వర్యంలో బర్కత్‌పురలోని ఈపీఎఫ్ ప్రాంతీయ కార్యాలయంలో మంగళవారం బోనాల ఉత్సవాలు నిర్వహించారు. ఈ బోనాల వేడుకల్లో ఆర్‌పీఎఫ్-1 కమిషనర్లు డాక్టర్ శివ కుమార్, సౌరవ్ జగతితో పాటు ప్రతినిధులు పి.రాంబాబు, సురేశ్, టీవీఎస్ ప్రసాద్, టీకారాం, సిబ్బంది పాల్గొన్నారు. అనంతరం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

లంగర్‌హౌస్‌లో ఘటం ఊరేగింపు..

అమ్మవారి ఘటానికి పూజలు చేసిన ఆలయ కమిటీ చైర్మన్ బి.పరమేశ్, కన్వీనర్ అరవింద్ తదితరులు

మెహిదీపట్నం : కార్వాన్ నియోజకవర్గం లంగర్‌హౌస్ డివిజన్‌లోని మార్కెట్‌లో వెలసిన బుజిలి మహంకాళి అమ్మవారి బోనాల కోసం కమిటీ నాయకులు సన్నాహాలను చేపట్టారు. బోనాలకు ముందు జరిగే ఘటం ఊరేగింపు మంగళవారం ఐదో రోజు పలు బస్తీలలో జరిగింది. ఆలయంలో అమ్మవారి ఘటానికి ఆలయ కమిటీ చైర్మన్ బి.పరమేశ్, కన్వీనర్ గురజాల అరవింద్, కోశాధికారి కె, మధు బస్తీ పెద్దలతో కలిసి పూజలు చేశారు.

సబ్జీమండీలో..

సబ్జీమండీలోని నల్ల పోచమ్మ, మహంకాళి బోనాల ఉత్సవాలలో.. ఆలయ కమిటీ సభ్యులు

కార్వాన్, జూలై 23 : ఆషాఢ మాస బోనాల ఉత్సవాలలో భాగంగా కార్వాన్ సబ్జీమండీలోని నల్ల పోచమ్మ, శ్రీ మహంకాళి ఉమ్మడి ఆలయాల అమ్మవారి ఘటం ఊరేగింపు ప్రారంభోత్సవంలో పాల్గొన్న కమిటీ అధ్యక్షుడు ప్యాట నంద కిశోర్, ప్రధాన కార్యదర్శి కుడుముల రాకేశ్ లతో పాటు ఆలయ కమిటీ సభ్యులు.

బీజేపీ కిసాన్ మోర్చా తెలంగాణ ఉపాధ్యక్షుడిగా దేవర శ్రీనివాస్

బీజేపీ కిసాన్ మోర్చా తెలంగాణ ఉపాధ్యక్షుడిగా దేవర శ్రీనివాస్‌ను నియమిస్తూ పార్టీ రాష్ట్ర కార్యాలయంలో మంగళవారం రాష్ట్ర అధ్యక్షుడు శ్రీధర్‌రెడ్డి నియామక పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా దేవర శ్రీనివాస్ మాట్లాడుతూ తన పై నమ్మకంతో రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా నియమించిన పార్టీ అధిష్టానానికి కృతజ్ఞతలు తెలిపారు.

– కార్వాన్, జూలై 23

సీఎం రిలీఫ్ ఫండ్ మంజూరు పత్రం అందజేత

సీఎం రిలీఫ్ ఫండ్ మంజూరు పత్రాన్ని అందజేస్తున్న ఎమ్మెల్యే కాలేరు వెంకటేశ్

గోల్నాక, జూలై 23 : గోల్నాక డివిజన్‌కు చెందిన సయ్యద్ జాంగీర్ నిమ్స్ దవాఖానలో శస్త్ర చికిత్స చేయించుకున్నారు. ఆయనకు సీఎం రిలీఫ్‌ఫండ్ నుంచి మంజూరైన రూ.1లక్షా75 వేల విలువగల పత్రాన్ని మంగళవారం ఎమ్మెల్యే కాలేరు వెంకటేశ్ బాధితుడి కుటుంబ సభ్యులకు అందజేశారు.

గౌడలకు ఇచ్చిన హామీలను అమలు చేయాలి

గౌడలకు ఇచ్చిన హామీలను తక్షణమే అమలు చేయాలని తెలంగాణ గౌడ కల్లుగీత సంఘాల సమన్వయ కమిటీ రాష్ట్ర ప్రభుత్వానికి డిమాండ్ చేసింది. చిక్కడపల్లిలోని కమిటీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో కమిటీ చైర్మన్ బాలగౌని బాల్‌రాజ్ గౌడ్, రాష్ట్ర కన్వీనర్ అయిలి వెంకన్నగౌడ్, వర్కింగ్ ప్రెసిడెంట్ యెలికట్టె విజయ్‌కుమార్ గౌడ్‌లతో కలిసి మాట్లాడారు. అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా కాంగ్రెస్ పార్టీ అధికారంలోనే అనేక హామీలు అమలు చేస్తామని మ్యానిఫెస్టోలో పెట్టారని తెలిపారు. ప్రభుత్వం ఏర్పడి 7 నెలలు గడుస్తున్నా ఇప్పటికీ ఇచ్చిన హామీలు అమలు చేయలేదని తెలిపారు.. ఇచ్చిన హామీలు వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. – చిక్కడపల్లి, జూలై 23

సంగం మఠాధిపతి రాహుల్‌దాస్ బాబాకు సన్మానం

కార్వాన్ నియోజకవర్గం లంగర్‌హౌస్ సంగం రామాలయం మఠాధిపతి రాహుల్ దాస్ బాబాను బస్తీ పెద్దలు ఘనంగా సన్మానించారు. వ్యాసగురుపౌర్ణమిని పురస్కరించుకుని బస్తీకి చెందిన వివిధ పార్టీల నాయకులు రాహుల్‌దాస్ బాబాను కలిసి ఆశీర్వాదం తీసుకున్నారు. ఈ కార్యక్రమంలో బాలప్రసాద్ తివారి, శోభాపాండే, వినేష్ సింగ్, లింగారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

– మెహిదీపట్నం, జూలై 23

మహంకాళి దేవాలయంలో రుద్ర త్రిశతి హోమం

హరిబౌలిలోని అక్కన్న మాదన్న మహంకాళి దేవాలయం 76వ వార్షికోత్సవ నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా ఆలయ కమిటీ కార్యనిర్వాహక కార్యదర్శి ఎస్.పి.క్రాంతికుమార్, శైలజ దంపతులు రుద్ర త్రిశతి హోమం, బిల్వార్చన పూజలు వేద పండితుల చేత అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కె.రవీనా రాయణమూర్తి, గోపాల్ మహారాజ్, ఆలయ కమిటీ ప్రతినిధులు, భక్తులు పాల్గొన్నారు.

– కాచిగూడ, జూలై 23

చంద్రశేఖర్ ఆజాద్ జయంతి

భారత స్వాతంత్ర్య సమర యోధుడు, ఆంగ్లేయులకు ముచ్చెమటలు పట్టించిన చంద్రశేఖర్ ఆజాద్ జయంతిని పురస్కరించుకొని హిందీ నగర్‌లోని చంద్రశేఖర్ ఆజాద్ స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లో ఆయన చిత్ర టాపటానికి పూలమలలు వేసి నివాళులర్పించిన జీహెచ్ఎంసీ ఉద్యోగులు రఘు, కాంతి, శ్రీను, మహేశ్, విజయ్, శ్యాంరాజ్, సంతోష్, సన్నీ, ప్రవీణ్, రవి, సూరి, మురళి తదితరులు. – అబిడ్స్, జూలై 23

అన్నదానం..

ప్రతి నెలా రోగి సహాయకులకు అన్నదానం చేయడం అభినందనీయమని టీఎన్జీవో కేంద్ర సంఘం అధ్యక్షుడు మారం జగదీశ్వర్ అన్నారు. మంగళవారం మెహిదీనవాబ్ జంగ్ క్యాన్సర్ దవాఖానలో అసద్ అన్వర్ మెమోరియల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో రోగి సహాయకులకు అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన ఆయన టీఎన్జీవో కేంద్ర సంఘం ప్రధాన కార్యదర్శి డాక్టర్ ఎస్ఎం ముజీబ్‌హుస్సేనీతో కలిసి అన్నదాన వితరణ చేపట్టారు. జిల్లా శాఖ కార్యదర్శి ఎస్. విక్రమ్ కుమార్,అసోసియేట్ అధ్యక్షుడు కేఆర్ రాజ్‌కుమార్, సభ్యులు హరిబాబు, వైదిక్ శస్త్ర,శ్రీధర్ నాయుడు, ఏపీఆర్‌వో మహ్మద్ వహీద్, ఎంఎన్‌జే క్యాన్సర్ దవాఖాన యూనిట్ సభ్యులు పాల్గొన్నారు. – సుల్తాన్‌బజార్, జూలై 23

డ్రగ్స్ సరఫరాను అరికట్టాల్సిన అవసరం ఎంతైనా ఉన్నది

సుల్తాన్‌బజార్, జూలై 23 : సమాజ హితం కోసం సామాజిక స్పృహతో డ్రగ్స్ సరఫరాను, వాడకాన్ని అరికట్టాల్సిన అవసరం ఎంతైనా ఉందని ఉస్మానియా యూనివర్సిటీ ఓఎస్‌డీ టు వీసీ ప్రొఫెసర్ బి. రెడ్యానాయక్ విద్యార్థులకు పిలుపునిచ్చారు. ఈ మేరకు మంగళవారం నిజాం కళాశాలలో ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో యాంటీ డ్రగ్స్ అవేర్‌నెస్ కాంపెయిన్ సందర్భంగా యాంటీ డ్రగ్స్ ర్యాలీని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన ఆయన కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ భీమా,వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ జి ఉపేందర్‌రెడ్డి,స్థానిక కార్పొరేటర్ డాక్టర్ సురేఖలతో కలిసి ర్యాలీని ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. డ్రగ్స్ వాడకం వల్ల వ్యక్తుల జీవితాలు ప్రమాదంలో పడతాయని అన్నారు. అంతే కాకుండా దేశం,రాష్ట్రాలతో పాటు సమాజం,డ్రగ్స్‌కు బానిసైన కుటుంబాలు ప్రమాదంలో పడే అవకాశం ఉంటుందని అన్నారు. డ్రగ్స్ అ లవాటు అడిక్షన్‌గా మారుతున్నందున డ్రగ్స్ వాడకుండా ఉండటమే కాకుండా డ్రగ్స్ ఎక్కడ కనిపించినా అరికట్టేందుకు విద్యార్థులు తమ వంతు పాత్రను పోషించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ జి ఉపేందర్‌రెడ్డి,ఎన్ఎస్ఎస్ ప్రొగ్రాం ఆఫీసర్స్ డాక్టర్ చిన్నాల వెంకటేశ్వర్లు, డాక్టర్ మంజుల, సుదర్శన్, ఈవోసి కోఆర్డినేటర్ డాక్టర్ కవిత, ఎగ్జామినేషన్ ఎవాల్యుయేషన్ ఆఫీసర్ స్వాతి, ఉమెన్ సెల్ కోఆర్డినేటర్ స్రవంతి, ఎస్సీసీ ఆఫీసర్ నవీన్‌రెడ్డి, ఎస్సీ,ఎస్టీ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు కుమార్, స్టూడెంట్ అడ్వైజర్ మహమ్మద్ అలీ, డిప్లమా కోర్సెస్ కోఆర్డినేటర్ డాక్టర్ భవాని శంకర్, ఎగ్జామినేషన్ ఎవాల్యుయేషన్ ఆఫీసర్ స్వాతి, ప్రోగ్రామర్ యాదగిరి, కేర్ టేకర్ ఎల్ నవీన్, తెలంగాణ నవనిర్మాణ సేన విద్యార్థి రాష్ట్ర అధ్యక్షులు టికే శివ ప్రసాద్ పాల్గొన్నారు.

నిజాం కళాశాలలో యాంటీ డ్రగ్స్‌పై నిర్వహించిన అవగాహన ర్యాలీని ప్రారంభిస్తున్న ఉస్మానియా యూనివర్సిటీ ఓఎస్‌డీ టు వీసీ ప్రొఫెసర్ బి. రెడ్యా నాయక్, ప్రిన్సిపాల్ భీమా

రైలు ఢీకొని వ్యక్తి మృతి

కాచిగూడ, జూలై 23: రైలు ఢీకొని వ్యక్తి మృతి చెందాడు. కాచిగూడ రైల్వే హెడ్ కానిస్టేబుల్ సమ్మయ్య కథనం ప్రకారం.. గౌలిగూడ ప్రాంతానికి చెందిన గంజి శంకర్(55) ఎలక్ట్రీషన్. సోమవారం అర్ధరాత్రి ఉప్పుగూడ రైల్వేస్టేషన్ సమీపంలో పట్టాలు దాటుతుండగా కాచిగూడ- మహబూబ్‌నగర్ ప్యాసింజర్ రైలు ఢీ కొనడంతో శంకర్ అక్కడికక్కడే మృతి చెందాడు. సమాచారం అందుకున్న రైల్వే పోలీసులు మృతదేహాన్ని ఉస్మానియా దవాఖానకు తరలించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

నిందుతులకు జైలుశిక్ష

చిక్కడపల్లి, జూలై 23 : ఇద్దరి నిందుతులకు మంగళవారం నాంపల్లి కోర్టు 9నెలల జైలు శిక్ష, రూ.100 జరిమానాను విధించిందని చిక్కడపల్లి పీఎస్ ఇన్‌స్పెక్టర్ సీతయ్య తెలిపిన వివరాల ప్రకారం. గత సంవత్సరం మార్చి 30వ తేదీన రాత్రి చిక్కడపల్లి మెయిన్ రోడ్డులోని న్యూ బంధరు మిఠాయి షాపు, రాజీవ్‌రెడ్డి స్వీట్‌షాప్‌లలో ఇద్దరు వ్యక్తులు షెటర్లను విరగగొట్టి దొంగతనానికి పాల్పడినట్టు ఫిర్యాదు వచ్చిందని తెలిపారు. నిందుతులైన రాజన్న తిరుపతి, రేగుల రవిలుగా గుర్తించి అరెస్ట్ చేసి 3-11-2023న నాపంల్లి కోర్టులో హాజరు పర్చినట్లు చెప్పారు. నేరం రుజువు కావడంతో మంగళవారం కోర్టు వారికి జైలు శిక్ష విధించినట్లు తెలిపారు.

సమాజంలో జర్నలిస్టుల పాత్ర కీలకం

జర్నలిస్టులకు స్వీట్ తినిపిస్తున్న ప్రకాశ్‌రెడ్డి

రవీంద్రభారతి, జూలై 23 : సమాజంలో జర్నలిస్టుల పాత్ర కీలమని బీజేపీ అధికార ప్రతినిధి ప్రకాశ్‌రెడ్డి అన్నారు. మంగళవారం రవీంద్రభారతిలోని సమావేశ మందిరంలో జర్నలిస్టు అసోసియేషన్ ఆఫ్ తెలంగాణ (టీజేఏ) 10వ వార్షికోత్సవాన్ని టీజేఏ రాష్ట్ర అధ్యక్షుడు రమణారావు అధ్యక్షతన జరిగాయి. ఈ కార్యక్రమానికి ప్రకాశ్‌రెడ్డి హాజరై మాట్లాడుతూ.. జర్నలిస్టుల సంఘాలు సంఘటితంగా ఉంటే సమస్యలు అధిగ మించవచ్చునని తెలిపారు. ఈ సందర్భంగా టీజేఏ జర్నలిస్టులకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర టీజేఏ ఫౌండర్ ఉప్పల లక్ష్మణ్, పాత్రికేయులు వాసుదేవరావు, 150 మంది జర్నలిస్టులు పాల్గొన్నారు.

27నుంచి మహంకాళి అమ్మవారి బోనాల ఉత్సవాలు

మహంకాళి అమ్మవారు

కాచిగూడ,జూలై 23: కోరిన కోరికలు తీర్చే కల్పవల్లిగా నింబోలి అడ్డా మహంకాళి అమ్మవారు భక్తుల నుంచి నిత్య పూజలు అందుకుంటుంది. కాచిగూడ నింబోలి అడ్డాలోని అతి పురాతనమైన 243 సంవత్సరాల చరిత్ర గల మహంకాళి దేవాలయంలో ఈ నెల 27, 28, 29 తేదీలలో జరిగే బోనాల ఉత్సవాలను పురస్కరించుకుని ఆలయాన్ని నిర్వాహకులు సుందరంగా తీర్చిదిద్దారు. నింబోలిఅడ్డలో నివసించే పటేల్ జంగులుగౌడ్ అనే వ్యక్తికి అమ్మవారు కలలో కనబడి తనకు ఆలయం నిర్మించాలని ఆదేశించగా పటేల్, జంగులు దర్బారు మైసమ్మ ఆలయాన్ని నిర్మించారు. రెండున్నర దశాబ్దాల క్రితం ఈ ప్రాంతాల ప్రజలు అంటు వ్యాధులతో తీవ్రంగా బాధ పడుతున్న సమయంలో అంటు వ్యాధుల బారి నుండి రక్షించాలని కోరుతూ ప్రజలు అమ్మవారికి బోనాలు సమర్పించగా అమ్మవారు రోగాల బారి నుంచి రక్షించారు. ఈ నెల 29వ తేదీన సాయంత్రం నాలుగు గంటల నుంచి అమ్మవారి వేదిక ప్రాంతంలో ఇతర రాష్ట్రాల నుంచి వచ్చిన కళాకారులు జాన పద గీతాలపాలన, ఫలహార బండ్లు, ఊరేగింపు ఉంటుందని నిర్వాహకుడు పేర్కొన్నారు. ముఖ్య అతిథులుగా హర్యానా గవర్నర్ బండారు దత్తాత్రేయ, కేంద్ర మంత్రులు జి.కిషన్ రెడ్డి, బండి సంజయ్, ఎమ్మెల్యే పద్మరావుగౌడ్, డాక్టర్ లక్ష్మణ్, చింతల రాంచంద్రారెడ్డి, కాచిగూడ కార్పొరేటర్ ఉమా రమేశ్‌యాదవ్‌తో పాటు వివిధ రాజకీయపార్టీ నాయకులు పాల్గొంటారు.

ఓయూ.. కట్టమైసమ్మ దగ్గరకు ప్రవేశం కల్పించాలి

ఓయూ అధికారులకు వినతిపత్రం అందజేస్తున్న బాగ్‌అంబర్‌పేట కార్పొరేటర్ బి.పద్మావెంకటరెడ్డి తదితరులు

అంబర్‌పేట, జూలై 23 : ఈ నెల 28వ తేదీన జరిగే బోనాల పండుగను పురస్కరించుకొని ఓయూలోని మోయిని చెరువు కట్టపై ఉన్న కట్టమైసమ్మ అమ్మవారి గుడికి వచ్చే భక్తులకు ప్రవేశం కల్పించాలని కోరుతూ ఓయూ అధికారులకు మంగళవారం వినతిపత్రం అందించారు. బోనాలు ఉన్నందున భక్తులకు అనుమతించాలన్నారు. బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు బి.వెంకటరెడ్డి, నాయకులు మిర్యాల శ్రీనివాస్, వెంకటరమణ రాజు, సతీశ్ తదితరులు పాల్గొన్నారు.

ఉత్తమ హెల్త్ ఆర్టీసీ డిపోగా కాచిగూడ

వాలంటీర్లకు నగదు, ప్రశంసా పత్రాలను అందజేస్తున్న ఎండీ సజ్జనార్, డిపో మేనేజర్ రఘు

కాచిగూడ, జూలై 23: విధులు సమర్థవంతంగా నిర్వహిస్తూ ఆరోగ్యాలను కపాడుకోవాలని కాచిగూడ ఆర్టీసీ డిపో మేనేజర్ టి.రఘు అన్నారు. తెలంగాణలోని 97 ఆర్టీసీ డిపోలలో కాచిగూడ డిపో ఉత్తమ హెల్త్ డిపోగా ఎన్నికైంది. ప్రతిరోజూ కార్మికులు, ఉద్యోగులకు ఆరోగ్య విషయంలో సేవలందించిన డిపో మేనేజర్ టి.రఘు, హెల్త్ వాలంటీర్లు రమేశ్, రమాదేవికి నగదుతో పాటు ప్రశంసా పత్రాలను ఆర్టీసీ ఎండీ వీసీ సజ్జనార్ మంగళవారం అందజేశారు.

జనరల్ సర్జరీ హెచ్‌వోడీగా డాక్టర్ ప్రవీణ్ బాధ్యతలు

ఉస్మానియా మెడికల్ కళాశాల, ఉస్మానియా దవాఖాన జనరల్ సర్జరీ విభాగం హెచ్‌వోడీగా మంగళవారం ప్రొఫెసర్ డాక్టర్ పల్లం ప్రవీణ్ బాధ్యతలను స్వీకరించారు. ఈ సందర్భంగా జనరల్ సర్జరీ విభాగం వైద్యులు డాక్టర్ బి. రమేశ్, డాక్టర్ సిద్దిపేట రమేశ్, డాక్టర్ రంగా అజ్మీరాతో పాటు పలువురు వైద్యులు పుష్పగుచ్ఛాన్ని అందించి ప్రత్యేక శుభాకాంక్షలు తెలిపారు. – సుల్తాన్‌బజార్